


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చునని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం జిల్లా అంతటా వివిధ పాఠశాలల్లో, కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. భీమవరం భారతీయ విద్యా భవన్ పాఠశాలలో మంత్రి వర్మ, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ అజిత తదితరులు పాల్గొని యోగసనాలు వేశారు. - 5లో.





ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్



కూటమి జోష్

ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం

నేడు ప్రమాణం చేయనున్న ఎమ్మెల్యే పితాని

పాలకొల్లు, జూన్ 21 : కూటమి శాసన సభ్యులలో జోష్ నెలకొంది. శుక్రవారం శాసనసభలో జిల్లాకు చెందిన శాసన సభ్యులతో ప్రోటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణం చేయించారు. మంత్రి నిమ్మల రామా నాయుడుతో పాటు ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్, పులపర్తి రామాంజ నేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, కలిదిండి రఘురామకృష్ణరాజు, ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు.ఆచంట ఎమ్మెల్యే పితాని సత్య నారాయణ హైదరాబాద్ నుంచి వచ్చేసరికి సమయం మించిపోవడంతో నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఐదేళ్ల అరాచక పాలనకు తెరపడి నూతనంగా కొలువు దీరిన నిండుశాసన సభలో జిల్లాలోని ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో సందడి నెలకొంది.

ఎమ్మెల్యేల ముందు సవాళ్లు..

ఇప్పటికే జిల్లాకు చెందిన శాసన సభ్యులు తమ తమ నియోజకవర్గాలలో చేపట్టే అభివృద్ధి పనులకు హామీలు ఇచ్చి ఉన్నారు. అంశాల వారీగా ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి సమాయత్తం అవుతామని శాసన సభ్యులు వెల్లడించారు జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ రామానాయుడుకు ఒక రైతుగా రైతు కష్టాలు తెలుసునని సాగునీటి కాలువలను ప్రక్షాళన చేసి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తారని జిల్లా వాసులు పూర్తిగా విశ్వసిస్తున్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెంలో ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టినట్టు ఎమ్మెల్యే బొలిశెట్టి తెలిపారు.అభివృద్ధికి పెద్ద పీట వేస్తామని తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ తెలిపారు. తీర ప్రాంత సమస్యలపై ప్రధానంగా దృష్టి పెడతానని బొమ్మిడి నాయకర్ హామీ ఇచ్చారు. ఆక్వా రంగాన్ని ఆదుకుంటామని రఘురామ కృష్ణరాజు, భీమవరాన్ని రోల్‌మోడల్‌గా నిలుపుతానని ఎమ్మెల్యే రామాంజనేయులు చెప్పారు. జిల్లాలో 50 శాతం పైబడి రహదారులు ధ్వంసం అయ్యాయి. పురపాలక సంఘాలలో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి పారిశుధ్యం క్షీణించింది. ఏడాది పొడవునా పట్టణాలలోని శివారు ప్రాంతాలలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనలో జిల్లాలోని మేజర్ డ్రైయిన్లు 90 శాతంపైబడి పూడుకు పోయాయి. పంట కాలువలు సైతం మురుగు కాలువలను తలపిస్తున్నాయి. వేసవి పూర్తయినా ఇప్పటికీ కాలువలు ప్రక్షాళన జరగలేదు. ఈ సవాళ్లను అధిగ మించడానికి మంత్రి నిమ్మలతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు సవాల్‌గా తీసుకుని పశ్చిమ గోదావరి జిల్లాను ప్రగతి పథంలో నిలపాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.





పులపర్తి రామాంజనేయులు, కనుమూరి రఘురామకృష్ణరాజు, బొమ్మిడి నాయకర్



సబ్సిడీపై కూరగాయలు అందించేందుకు చర్యలు

అధికారులతో కలెక్టర్ సుమిత్ కుమార్ సమీక్ష

భీమవరం టౌన్, జూన్ 21: రైతు బజార్ల ద్వారా కూర గాయలను సబ్సిడీ ధరలకు అందించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు రోజురోజుకు పెరుగుతున్న దృష్ట్యా సంబంధిత శాఖల అధికారులతో కమిటీని ఏర్పాటు చే శామన్నారు. ఏ రకాలు ఏఏ ప్రాంతాల్లో పండుతాయో అక్కడ నుంచే నేరుగా కొనుగోలు చేసి రైతు బజార్ల ద్వారా సబ్సిడీ ధరల్లో విక్రయించడానికి ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. మదనపల్లెలో టమాట ఎక్కువగా దొరుకుతుందని, అక్కడి నుంచి టమాటాను కొనుగోలు చేయాలని సూచించారు. రానున్న రెండు రోజుల్లో ధరల్లో హెచ్చు తగ్గులను బేరీజు వేసుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. భీమవరం రైతుబజార్‌కు సంబంధించిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా రైతు బజార్‌లోని ఆర్వో ప్లాంటును రూ.40 వేలతో వెంటనే మరమ్మతు చేయించాలన్నారు. రైతు బజార్లో ఏర్పాటు చేసిన మాంసం దుకాణాల వద్ద ధరల పట్టీ తప్పక ప్రద ర్శించాలని ఆదేశించారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామ్ ప్రసాద్, డీఎస్‌వో సరోజ, ఉద్యానవనశాఖ అధికారి దేవానంద్ కుమార్,మార్కెటింగ్ శాఖ అధికారి కె.సునీల్ కుమార్, భీమవరం రైతుబజార్ ఎస్టేట్ అధికారి కళ్యాణ్, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రేవు పాటకు నోటిఫికేషన్

వచ్చే నెల 8న పాట.. ప్రారంభ ధర రూ.3.61 కోట్లు

నరసాపురం రూరల్, జూన్ 21: ఎట్టకేలకు మాధవాయి పాలెం-సఖినేటిపల్లి రేవు పాటకు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రేవు నిర్వహణ పాట ప్రారంభ ధరను రూ 3.61 కోట్లుగా నిర్ణయించారు. వచ్చే నెల 8న మండల పరిషత్ కార్యాలయంలో పాట నిర్వహిస్తారు. సీక్రెట్, బహిరంగ పద్ధతిలో టెండర్ జరుగుతుంది. ఈ రెండింటిల్లో హెచ్చు మొత్తంలో ఎవరు కోడ్ చేస్తే వారికి నిర్వహణ బాధ్యతల్ని అప్పగిస్తారు. టెండర్ ఫారాలను శుక్రవారం నుంచే జారీ చేస్తున్నారు. ఒక్కొక్క షెడ్యూల్ ధర రూ.2 వేలు. ఇది కాకుండా మరో రూ.240 ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. టెండర్ ఫారాలు వచ్చేనెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు స్వీకరిస్తారు. సీల్ టెండర్లు 8న దాఖలు చేసుకోవచ్చు. పాట దక్కించుకున్న పాటదారుడు రూ.36.10 లక్షలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది మార్చిలో పాట నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఎన్నికల కోడ్ వల్ల వాయిదా పడింది. కొత్త సంవత్సరం ఆరంభం నుంచి పాత పాటదారుడే రోజుకు రూ.1.05 లక్షలు చెల్లిస్తూ రేవును నిర్వహిస్తున్నాడు.

విహారం..విషాదం

- రామాపురం బీచ్‌లో నలుగురు గల్లంతు
- రెండు మృతదేహాలు లభ్యం.. మరో ఇద్దరి కోసం గాలింపు
- ప్రాణాలతో బయటపడ్డ మరో ఏడుగురు
- సహాయక చర్యలపై చింతమనేని ఆరా


తేజ (ఫైల్)


కిశోర్ (ఫైల్)


అమల్ రాజా (ఫైల్)


నితిన్ (ఫైల్)

పెదవేగి, జూన్ 21 : ఏకబిగిన పనిచేసిన మిత్రులంతా సరదాగా గడిపి వద్దామనుకుని బీచ్‌కెళ్తే.. చివరికి వారికి విషాదమే మిగిలింది. రెక్కాడితేకాని డొక్క నిండని కుటుంబాలకు చెందిన పదకొండు మంది మిత్రులు వారంతా. వారిలో కొంతమంది చదువుకుంటున్నారు. వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండకుండా తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటుందనే ఆలోచనతో పనులకు వెళ్లారు. తిరిగి కళాశాలలకు వెళ్లే సమయం రావడంతో సరదా గడపడానికి మిత్రులంతా కలసి బీచ్‌కు వెళ్లి సరదాగా గడిపారు. ఇంతలో పెను అల ఒకటి వారిని కబళించింది. వారిలో కొంతమంది ప్రాణాలతో బయటపడగా, నలుగురు అలల తాకిడికి గల్లంతయ్యారు. రెండు మృతదేహాలు లభ్యంకాగా, మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..

పెదవేగి మండలం దుగ్గిరాలకు చెందిన జాల కిశోర్ (26) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ పెళ్ళిళ్లకు డెకరేషన్ పనులు చేస్తుంటాడు. అతని సమీప బంధువులతో పాటు మరి కొంతమంది యువకులు అతనితో పాటు ఆ పనులకు వెళ్తుంటారు. వారిలో కొంతమంది ఇంటర్ పూర్తిచేసినవారు ఉన్నారు. మొత్తం 11 మంది మిత్రుల్లో ఎనిమిది మంది దుగ్గిరాలకు చెందిన వారు కాగా, ముగ్గురిది అంకన్నగూడెం. తిరిగి కళాశాలకు వెళ్ళే సమయం కావడంతో అందరూ కలిసి సరదాగా గడిపి వద్దామని బాపట్ల జిల్లా వేటపాలెం దగ్గర రామాపురం బీచ్‌కు వెళ్ళడం కోసం ఇంటిదగ్గరే వంట సిద్ధం చేసుకుని, శుక్రవారం ఉదయం వ్యాన్‌లో బయలుదేరి వెళ్ళారు. అక్కడ సముద్రంలో స్నానం చేస్తుండగా పెను అల తాకిడికి మిత్రులు కకావికలయ్యారు. వారిలో ఏడుగురు ప్రాణాలతో బయటపడగా, నలుగురు గల్లంతయ్యారు.

జాలా కిషోర్ (26), తేజ(19), అమల్‌రాజా (19), నితిన్ (19), గౌతమ్, సాగర్, మోహన్, తేజ, సునీల్, రామరాజు, మురళి వీరంతా రామాపురం సముద్రం వద్దకు వ్యాన్‌లో శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో వచ్చారు. అరగంట పాటు భోజనం చేశారు. 2:30కు సము ద్రంలో దిగారు. ఒక్కసారిగా కెరటాల ఉధృతి పెరిగి వాటి తాకిడికి కొట్టుకుపోయారు. వారిలో ఏడుగురు బయ టకు రాగా కిషోర్, తేజ, నితిన్, అమల్‌రాజా గల్లంతయ్యారు. దీంతో బయటకు వచ్చిన వారు బిగ్గరగా కేకలు వేయగా మెరైన్, రూరల్ పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. అయితే కొద్దిసేపటికే గొటుకుల తేజ, జాలా కిషోర్ మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకురాగా, నితిన్, అమల్‌రాజా జాడ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనపై ఈపూరు పాలెం పోలీసులు కేసు నమోదు చేసు కుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలిం చారు. మృతదేహాలను హోంమంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. ఘటన ఎలా జరిగిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రానికల్లా వచ్చేస్తామని చెప్పి వెళ్ళిన కుమారులు కానరాని లోకాలు తరలిపోయారు అంటూ రోదిస్తున్న తల్లిదండ్రులను ఓదా ర్చడం ఎవ్వరివల్ల కావడంలేదు. ఈ ఘటనతో దుగ్గిరాలలో తీవ్ర విషాదం అలముకుంది.


తక్షణ సహాయక చర్యలు చేపట్టండి : ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

ప్రమాద సమాచారం తెలుసుకున్న దెందులూరు శాసన సభ్యుడు చింతమనేని ప్రభాకర్, బాపట్ల జిల్లా పోలీస్ అధికారులతో సహాయక చర్యలపై ఆరా తీశారు. తక్షణం సహాయక చర్యలను మరింత ముమ్మరం చేసి గల్లంతైన యువకుల ఆచూకీ కనుగొనాలని పోలీసులకు సూచించారు.

మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్‌గా శ్రీనివాస్



పెనుమంట్ర, జూన్ 21 : మార్టేరు ప్రాంతీయ వ్యవ సాయ పరిశోధన స్థానం నూతన ఏడీఆర్‌గా డాక్టర్ టి.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరిం చారు. గుంటూరు విశ్వ విద్యా లయ కేంద్ర కార్యాలయం నుంచి దీనికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన డాక్టర్ డి.శ్రీనివాస్ రాజ మహేంద్ర వరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా బదిలీపై వెళ్లారు. పరిశోధన స్థానంలోని సిబ్బంది, వ్యవసాయ పాలిటెక్నిక్ సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్ఛాలతో శుభా కాంక్షలు తెలిపారు. గతంలో ఆయన ఇక్కడే వివిధ స్థాయిల్లో పనిచేయడం వల్ల ఆయనకు పరిశోధనా కేంద్రంపై పూర్తి అవగాహన ఉంది. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు, మిల్లర్లు, వినియోగదారుల అవసరాలకు అనువైన మధ్య కాలిక, పడిపోని, అధిక దిగుబడినిస్తూ తిండి గింజలకు అనువైన వరి రకాల రూపకల్పనకు తగిన ప్రాధాన్యం ఇస్తామని, సాగు ఖర్చులు తగ్గించడానికి నూతన యంత్రాల రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు



సమావేశంలో మాట్లాడుతున్న భీమవరం ఫోక్సో కోర్టు న్యాయమూర్తి సోమశేఖర్

29న జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల రాజీకి కృషి చేయాలి

భీమవరం క్రైం, జూన్ 21 : జూన్ 29న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి కృషి చేయాలని భీమవరం ఫోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్.సోమశేఖర్ న్యాయవాదులకు, పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం ఫోక్సో కోర్టులో సమీక్షించారు. ప్రతీ రోజు అన్ని కోర్టుల్లో ప్రీలోక్ అదాలత్ సిట్టింగ్‌లు జరుగుతున్నాయని తెలిపారు. న్యాయమూర్తుల సమక్షంలో కేసుల రాజీకి ప్రయత్నించాలని సూచించారు. సమావేశంలో సివిల్ జడ్జి అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి పి.హసీషా, 2వ అదనపు సివిల్ జడ్జి ధనరాజు, డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్ట ర్లు, సుబ్బారావు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



పాపం.. వలంటీర్లు

అయోమయంలో రాజీనామా చేసినవారు

ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు

విధుల్లోకి తీసుకోవాలంటూ వేడుకోలు

రాజీనామా చేయని వారిలో జోష్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రాజీనామా చేసిన వలంటీర్లు వేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం మారిపోవడంతో భవిష్యత్తు ప్రశ్నార్థకమైం దంటూ లబోదిబోమంటున్నారు. మళ్లీ విధుల్లోకి తీసుకోవాలంటూ వేడుకుంటున్నారు. జిల్లాలో ఎన్నికైన శాసన సభ్యులను కలిసి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. వైసీపీ నాయకులు ఒత్తిళ్లతోనే రాజీనామా చేశామంటూ చెప్పుకొస్తున్నారు. ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకుంటే తప్ప రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి తీసుకునే పరిస్థితి లేదు. ఇదే విషయాన్ని జిల్లా ప్రజాప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో జిల్లావ్యాప్తంగా 9,200 మంది వలంటీర్లు విధులు నిర్వహిం చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు వలంటీర్లను విధులకు దూరంగా ఉంచారు. అయితే దానిని వైసీపీ తన రాజకీయాలకు వాడుకుంది. తెలుగుదేశం, కూటమి వల్లే వలంటీర్లు విధులకు దూరంగా ఉండాల్సి వచ్చిందని వైసీపీ ఎదురుదాడికి దిగింది. కొంతమంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా బాట పట్టారు. నేరుగా వైసీపీ ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి రాజీనామా పత్రాలను సమర్పించారు. అప్పటి ఎమ్మెల్యే సూచనమేరకు మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలకు రాజీనామా పత్రాలు అంద జేశారు. వైసీపీ నాయకులు మిగిలిన వలంటీర్లపై ఒత్తిడి తెచ్చారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ వలంటీర్లపై ఒత్తిడి పెరిగింది. వార్డు ఇన్‌ఛార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, గ్రామ నాయకులు అంతా వలంటీర్లను రాజీ నామా చేయాలంటూ ఆదేశాలు జారీచేశారు. అందుబాటులో లేని వలంటీర్లకు ఫోన్‌లు చేసి మరీ హెచ్చరికలు జారీచేశారు. రాజీనామా చేసిన వారిని మాత్రమే మళ్లీ విధుల్లోకి తీసుకుంటామని, లేని వారిని తప్పిస్తామంటూ పదే పదే వైసీపీ నేతలు చెప్పుకొచ్చారు. ఫలితంగా జిల్లాలో 5,160 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. మిగిలిన 4,040 మంది విధుల్లో ఉన్నారు.

ఎన్నికల్లో పాల్గొన్న వలంటీర్లు

రాజీనామా చేసిన వలంటీర్లను వైసీపీ ఎన్నికల ప్రచారానికి వినియోగించుకుంది. సంక్షేమ పథకాల లబ్ధిదారులు, ఇతర ప్రయోజనాలు పొందిన వారితో వలంటీర్లు మమేకం కావడంతో ఎన్నికల్లో ఉప యోగపడతారని వైసీపీ భావించింది. రాజీనామాలు చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వారికి నెలకు రూ.5 వేల వంతున అభ్యర్థులే వేతనం ఇచ్చారు. గ్రామంలోకి



ప్రచారానికి వచ్చిన వైసీపీ అభ్యర్థులకు వలంటీర్లు స్వాగతం పలికేలా స్థానిక నాయకులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. కానీ వైసీపీ ప్రణాళిక తప్పింది. వలంటీర్లు తమ పరిధిలో ఉన్న ఓటర్లను ప్రలోభ పెట్ట లేకపోయారు. కేవలం అభ్యర్థుల వెంట ప్రచారానికి పరిమితమయ్యారు. వలంటీర్లే లేకపోతే ఎన్నికలే లేవంటూ వైసీపీ అభ్యర్థులు మబ్బులో మునిగిపోయారు. కేడర్‌ను వదిలేశారు. భారీ ఓట్ల తేడాతో ఓటమిని చవి చూశారు. వలంటీర్లను నమ్ముకుని కార్యకర్తలను విస్మరించిన వైసీపీ నాయకులకు గుణపాఠం అయ్యింది. వైసీపీ నేతలు మాటలు నమ్మి రాజీనామాలు చేసిన వలంటీర్లు ఇప్పుడు వీధినపడ్డారు.

రాజీనామా చేయని వారిలో జోష్

వైసీపీ నేతలు హెచ్చరించినా జిల్లాలో అనేకమంది వలంటీ ర్లు పట్టించుకోలేదు. రాజీనామా చేస్తే తమ గుర్తింపు నెంబర్ ఉండదంటూ వలంటీర్లు భావించారు. పైగా ప్రభుత్వం మారితే అసలుకే మోసం వస్తుందని ఊహించారు. దానికి తోడు కూటమి కూడా వలంటీర్లు వేతనం పెంచుతామని ప్రకటించింది. కూటమి అభ్యర్థులు కూడా ఇదే విషయం చెప్పారు. రాజీనామా చేయొద్దంటూ కోరారు. దాంతో రాజీ నామా చేయనివారు ఇప్పుడు కూటమికి అనుకూలంగా ఉన్నట్టు తేల్చారు. చేసిన వారంతా ప్రజాప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నారు. రాజీనామా చేయని వారికి ఇప్పటిదాకా ప్రభుత్వమే వేతనం ఇస్తూ వస్తోంది. అంటే అధికారికంగా వారంతా కొనసాగుతున్నారు. జూలై నెలలో ఇంటింటికి పెన్షన్‌ను వలంటీర్లతోనే పంపిణీ చేయాలని ప్రభుత్వం ప్రణాళిక చేస్తోంది. దాంతో రాజీనామా చేసిన వారంతా ఇప్పుడు తెలుగుదేశం కూటమి ప్రజా ప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నారు. వైసీపీ ఒత్తిడితో రాజీనామా చేయాల్సి వచ్చింది..తమకు రాజకీయాలతో సంబంధం లేదంటూ చెప్పుకొస్తున్నారు. అయితే అంతిమంగా ప్రభుత్వ నిర్ణయంపైనే వారి భవితవ్యం ఆధారపడి ఉంది.

వశిష్ఠ గోదావరికి పంచ హారతులు..

పెనుగొండ, జూన్ 21 : జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి సిద్ధాంతం హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గోదావరి మాతకు పంచహారతులు నిర్వహించారు. ఏకముఖ, ద్విముఖ, చతుర్ధ, పంచమ, కుంభ, నక్షత్ర, పూర్ణ, కుంభ, సర్ప, హారతులు వేద పండితులు నిర్వహించారు. నదీమతల్లులను ఆరాధించడం అనాధిగా వస్తున్న మన సంప్రదాయమని తెలిపారు. కలగా భద్రుడస్వామి బ్రహ్మత్వంలో యర్రంశెట్టి శ్రీనివాస్, జయలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.








ఏలూరులో జిల్లా జడ్జి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగా.. భీమడోలు కోర్టు ఆవరణలో జడ్జి రిషిక్ ఆదిత్య యోగాసనాలు.. కైకరం హైస్కూలులో విద్యార్థుల యోగాసనాలు.. ఏలూరు యోగా దినోత్సవంలో మాట్లాడుతున్న ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాసవిశ్వనాథ్



వట్లూరు టీటీడీ కళాశాలలో యోగా




భీమవరం యోగా కార్యక్రమంలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అజిత.. ఏపీ నిట్‌లో విద్యార్థులు, ఆచార్యుల యోగాసనాలు



రోప్‌పై వేలాడుతున్న విద్యార్థిని



ఏలూరులో యోగా గురువు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఉత్సాహంగా యోగా దినోత్సవం

భీమవరంటౌన్, జూన్ 21 : యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని భారతీయ విద్యా భవన్ పాఠశాలలో పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 'స్వయం, సమాజం కోసం యోగా' అనే థీమ్‌తో ఈ ఏడాది నిర్వహించిన యోగా డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. మన ప్రాచీన సంస్కృతిలో యోగా ఒక భాగమని, ప్రస్తుత మన జీవన విధానంలో మార్పులు వచ్చాయని, మన ప్రాచీన జీవన విధానాన్ని తిరిగి స్వీకరించాలని తెలిపారు. అద్భుత ఫలితాలను ఇచ్చే యోగా ఇప్పుడు విశ్వవ్యాపితం అయిందన్నారు. 2014లో భారత ప్రధానిగా మోదీ పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకునేందుకు ఆయన కృషి చేశారన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా చేయాలన్నారు. తొలుత కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ అజిత వేజెండ్ల, జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య ఇతర అధికారులు, విద్యార్థులతో కలిసి స్వయంగా యోగా చేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం వారిని సత్కరించింది. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, జిల్లా అదనపు ఎస్పీలు భీమారావు, ఏటీవీ రవికుమార్, భారతీయ విద్యా భవన్ సెక్రటరీ యూకే విశ్వనాథ రాజు, వైస్ చైర్మన్ బీహెచ్ అచ్యుత రామరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో..

ఆరోగ్య పరిరక్షణకు యోగా సరైన మార్గం

ఏలూరు క్రైం : మానసిక ఒత్తిడిని అధిగమించడానికి, ఆరోగ్య పరిరక్షణకు యోగా సరైన మార్గమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో శుక్రవారం ఉదయం యోగా శిక్షణ కార్యక్రమంలో న్యాయమూ ర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక గంట జ్ఞానం, యోగా చేయడం ద్వారా మానసిక, శారీరక రుగ్మతలను నిర్మూలించవచ్చని సూచించారు. ఐదో అదనపు జిల్లా జడ్జి జి. రాజేశ్వరి, పోక్సో జడ్జి ఎస్.ఉమాసునంద, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ. శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులికృష్ణ, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

యోగా.. పరిచయం ఘనత భారత్ దే

తాడేపల్లిగూడెం అర్బన్ : యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత భారతదేశానిదే నని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. సంస్థలోని ఎడ్యుకేషన్ శాఖ ఆధ్వర్యంలో ఏపీ నిట్ ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యోగా శిక్షకులు డాక్టర్ శ్రీనివాస్, సంధ్యారాణి విద్యార్థులు, ఆచార్యులతో యోగాసనాలు వేయించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ కిరణ్‌తీపర్తి, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ రాముడు, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ యువరాజ్, డాక్టర్ జగన్మోహన్‌రావు పాల్గొన్నారు

విద్యార్థుల యోగాసనాలు

భీమవరం అర్బన్, జూన్ 21: భీమవరం చింతలపాటి బాపిరాజు మెమోరియల్ హైస్కూల్ ఆవరణలో హైస్కూల్ విద్యార్థులు, డీఎన్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలసి పోల్, రోప్‌పై యోగాస నాలు వేశారు. పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు పీసీ శేఖర్‌రాజు, డీవీ రామభద్రరాజు ఆధ్వర్యంలో యోగాసనాలు పాఠశాల హెచ్ఎం బి.శీనివాస రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శివాజీరాజు, బీఈడీ కాలేజీ ప్రిన్సి పాల్ జె.షకీలా తదితరులు పాలొన్నారు.





భీమవరం బాపిరాజు హైస్కూలులో పోల్‌పై విద్యార్థుల యోగాసనాలు

హైకోర్టు జడ్జిలు.. నేడు ఏలూరు రాక

ఏలూరు క్రైం, జూన్ 21 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పోర్టుపోలియో జడ్జి, హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణమోహన్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఏవీ శేషసాయి శనివారం ఉదయం ఏలూరు రానున్నారు. తొలుత రెవెన్యూ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని అనంతరం న్యాయాధికారులతో కలెక్టరేట్‌లోని గోదావరి కాన్ఫరెన్సు హాలులో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

మల్టీ టాస్కు స్కేటింగ్‌లో చిన్నారి ప్రపంచ రికార్డు



పోటీని ప్రారంభిస్తున్న కలగర వెంకటకృష్ణ

తణుకు, జూన్ 21 : మల్టీ టాస్క్ రోడ్డు స్కేటింగ్‌లో ఏడేళ్ళ చిన్నారి ప్రపంచ రికార్డు సాధించింది. శుక్రవారం తణుకు జాతీయ రహదారిపై 18 కిలోమీటర్ల మేర మల్టీ టాస్కులతో జరిగే పోటీలను టీడీపీ పట్టణ అధ్యక్షుడు కలగర వెంకట కృష్ణ, బసవా రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. తణుకు స్కేటింగ్ అకాడమీలో శిక్షణ పొందిన అలంపురానికి చెందిన ఎం.ధన్విక అనే ఏడేళ్ళ చిన్నారి ఘనత సాధించింది. మల్టీ టాస్కులలో రెండు కిలోమీటర్లు తలమీద కుండలో ఫైర్, బ్లైండ్ పోల్డ్‌తో కుండ, కర్రసాము, రింగ్ విత్ కుండ, బ్యాక్ స్కేటింగ్, ఒకచేత్తో స్టిక్, ఒకచేత్తో కుండ, ఫ్లాగ్ క్యారీ, రోల్ బాల్ వంటి వాటిలో రికార్డు సాధించారు. జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు ఇంటర్నేషనల్ ప్రతినాధులు ప్రపంచరికార్డులో పొందుపర్చారు. అనంతరం చిన్నారి ధన్వికను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందించారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 21 : వివాహ సమయంలో ఇచ్చిన కట్నం చాలలేదంటూ అదనపు కట్నం తీసుకురావాలని భర్త, అత్తింటి వారు వేధింపులకు గురి చేయ డంతో బాధితురాలు ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు సమీపంలోని సత్రంపాడు హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న ఎంఎం మనోజకు పదకొండేళ్ల క్రితం ఏలూరు ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెం ట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావుతో వివాహమైంది. వివాహ సమయంలో ఇచ్చిన కట్నంచాలలేదని అదనంగా మరో ఐదు లక్షల రూపాయలు తీసుకురావాలని భర్త వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు గడ్డి వాములు దగ్ధం

పాలకొల్లు రూరల్, జూన్ 21 : మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం రాత్రి పది ఎకరాల గడ్డి వాములు దగ్ధమయ్యాయి. వడ్లవానిపాలెం, నాగరాజు పేట గ్రామాల్లోని రైతులు వడ్లవానిపాలెం శివారు గొల్లవానిచెరువు గ్రామస్థుడు ఉప్పలపాటి రాజేష్‌కు చెందిన పది ఎకరాల గడ్డి వాము, నాగరాజుపేటలోలోని కేఎస్ రాజుకు చెందిన పది ఎకరాల గడ్డివామును గుర్తు తెలియని వ్యక్తులు కా ల్చి వేసినట్టు భావిస్తున్నారు. పాలకొల్లు, నరసాపురం ఫైర్ ఆఫీసర్లు వైవీ జానకీ రామ్, కె.భాస్కరరావు సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేసినప్పటికీ పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.80 వేలు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని ఫైర్ ఆఫీ సర్లు తెలిపారు. ఈ విషయమై ఏవిధమైన ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.

చంద్రబాబు హయాంలో పంచాయతీలకు స్వర్ణయుగం

ఏలూరు రూరల్, జూన్ 21 : చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో ఇక రాష్ట్రంలోని పంచాయతీలకు స్వర్ణయుగమేనని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు కడలి గోపాలరావు అన్నారు. ఏలూరులో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ వ్యవస్థను జగన్‌మోహన్‌రెడ్డి విధ్వంసం చేశారని, సర్పంచ్ లను ఉత్సవ విగ్రహాలుగా మార్చి వేల కోట్ల రూపాయలను దారి మళ్లించా రని ఆరోపించారు. పంచాయతీలకు ఒక్కరూపాయి కూడా నిధులు కేటాయించలేదని, 14-15 ఆర్థిక సంఘాల ద్వారా పంచాయతీలకు విడుదల చేసిన దాదాపు రూ.8,669 కోట్లు నిధులు దారి మళ్ళించిందని ఆరోపించారు. పంచాయతీలకు ఇవ్వాల్సిన వేలకోట్లు నిధులకు కూడా ఎగనామం పెట్టిందని, సర్పంచ్‌ల ద్వారా పనులు చేయించి గ్రామాభివృద్ధికి తోడ్పాడాల్సిన రూ.36వేల కోట్లను నరేగ నిధులను దారి మళ్లించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సర్పంచ్‌లకు చంద్రబాబు ఇచ్చిన సర్వాధికా టరాలు అందజేస్తామని చెప్పిన మాట నిలబెట్టుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకే కేటాయిస్తామని, పెండింగ్‌బిల్లులు వడ్డీతో సహా చెల్లిస్తామని, ఇటీవల జరిగిన సర్పంచ్‌ల సదస్సులో చంద్రబాబు అభయమిచ్చారని పేర్కొన్నారు. ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటుచేసి రాష్ట్రబడ్జెట్‌లో కనీసం ఐదుశాతం నిధులు పంచాయతీలకు కేటాయిస్తామని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ లకు రూ.10వేలు గౌరవవేతనం అందజేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చార న్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లే కీలక భూమిక పోషించేలా ప్రత్యేక చర్యలు చేపట్టేలా పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి కోరతామని స్పష్టం చేశారు. గౌరవ అధ్యక్షుడు పిల్లి వెంకటసత్యరాజు, సర్పంచ్‌ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మిశెట్టి సత్యనారాయణ, ఆర్.లక్ష్మీసునీల, సర్పంచ్ లు దిడ్లా అలకనంద, జి.లక్ష్మిశ్రీనివాస్, పడాల దుర్గాభవానీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాంబర్ అధ్యక్షుడు కడలి గోపాలరావు

క్రైం సమాచారం

బస్సు టైర్ కిందపడి మోటారు సైక్లిస్టు మృతి

నరసాపురం, జూన్ 21: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో శుక్రవారం ఆర్టీసీ బస్సు వెనుక టైర్ కింద పడి మోటారు సైక్లిస్ట్ బి.రాజ్‌కుమార్(40) మృతి చెందాడు. పాలకొల్లు రోడ్ నుంచి బైక్‌పై వస్తూ ముందు వెళుతున్న బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. వెనుక టైర్ కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టు ధ్రువీకరించారు. బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి స్వల్పగాయాలతో బయటప డ్డాడు. మృతుడు మొగల్తూరు గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ స్వామి తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ప్రమాదం జరిగిన ప్రదేశంలో కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేశారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆర్టీసీ అధికారులు, పోలీసులు చర్చలు జరపడంతో ఆందోళన విరమించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో బిహార్ కూలీ మృతి

టి.నరసాపురం, జూన్ 21 : ట్రాక్టర్ ప్రమాదంలో బిహార్ నుంచి వలసవచ్చిన కూలీ మృతి చెందినట్టు ఎస్‌ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. బిహార్ రాష్ట్రం జమ్ము జిల్లా బహరాంబసికింద్ర మండలం ముబార్క్‌పూర్‌కు చెందిన సరేన్ మంజి (29) మరికొందరు కూలీలు కలిసి ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల నిమిత్తం మండలంలోని ఏపీగుంట గ్రామం వచ్చారు. ఏపీగుంట క్యాంప్‌లో ఉంటూ రోడ్డు పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 20న మండలంలోని వెంకటాపురం సమీపంలో ట్రాక్టర్‌పై సిమెంట్ రాళ్ళు లోడు చేసుకుని తోటి కూలీలతో వెళుతుండగా ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంతో నడపడంతో అదుపుతప్పి సరేన్ మంజి కిందపడగా అతడిపై సిమెంట్ రాళ్లు పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి, అక్కడి నుంచి చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తీసుకువెళుతుండగా మార్గ మధ్యలో మృతిచెందినట్లు మృతుడి బంధువు మెంగల్ మంజి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

లింగపాలెం, జూన్ 21: నిద్రిస్తున్న మహిళ మెడలో బంగారపు గొలుసు చోరీ జరిగిన ఘటన ధర్మాజీగూడెంలో జరిగింది. ఎస్‌ఐ పి.చెన్నారావు తెలిపిన వివరాలివి.. గ్రామంలోని మాస్టర్ టీపాయింట్‌లో కటారి సాయిదుర్గ అనే మహిళ కుటుంబసభ్యులతో కలిసి ఉంటుంది. గురువారం రాత్రి షాపులో నిద్రిస్తుండగా తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని మూడున్నర కాసుల బంగారు గొలుసు లాక్కెళ్లినట్టు తెలిపారు. ఈమేరకు బాధిత మహిళ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎంబీఏ విద్యార్థిని మృతి



గీతావాణి (ఫైల్)

పెనుమంట్ర, జూన్ 21 : పెనుమంట్ర మండలం నెగ్గిపూడి లాకుల వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుగొండ కాలేజీలో ఎంబీఏ ఫైనలియర్ విద్యార్థిని దేవగానుగుల గీతావాణి(23) అక్కడికక్కడే మృతి చెందారు. పెనుమంట్ర పోలీసులు తెలిపిన వివరాలివి.. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వేలివెన్నుకి చెందిన గీతావాణి పెనుగొండ ఎస్‌వీకేపీ కాలేజీలో ఎంబీఏ చదువుతుంది. పరీక్షల నిమిత్తం పుట్టినిల్లు అయిన మార్టేరు శివారు శివరావుపేట నుంచి పరీక్షలు రాసేందుకు పెనుగొండ కాలేజీకి స్కూటీపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి లారీని ఢీకొంది. ఈ ఘటనపై స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు పెనుమంట్ర ఏఎస్‌ఐ వేంద్ర వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించామని తెలిపారు.

- వివాహమై రెండేళ్లు అయినప్పటికీ చదువుపై ఉన్న మక్కువతో ఎంబీఏ పూర్తి చేస్తానని భర్తను ఒప్పించి పెనుగొండ కళాశాలలో చదువుతుంది. పరీక్షలకు పుట్టింటి నుంచి వెళ్తానని చెప్పి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

» రూ.2.80 లక్షల విలువైన రెండు బైక్‌ల స్వాధీనం

ఏలూరు క్రైం, జూన్ 21 : మోటారు సైకిళ్ళ దొంగతనాలకు పాల్పడుతున్న ఓ యువకుడిని ఏలూరు వన్‌టౌన్ ఎస్‌ఐ పి.నవీన్‌కు మార్ వారి సిబ్బంది కలిసి శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. ఏలూరు వన్‌టౌన్‌లోని గాంధీ మైదానం గవర్నమెంటు మద్యంషాపు వద్ద ఒక యువకుడు నంబర్‌లేని పల్సర్‌బైక్‌తో అనుమానాస్పదంగా ఉండడంతో ఎస్‌ఐ వారి టీమ్ అయిన హెడ్‌కానిస్టేబుల్ ఎ.అప్పన్న, కానిస్టేబుల్ కె. శ్రీనివాసరావు ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఆ యువకుడు ఏలూరు సమీపంలోని శనివారపుపేట మసీదు దగ్గర నివాసం ఉంటున్న షేక్ ఆదిల్‌గా గుర్తించారు. ఇటీవల ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో అపహరణకు గురైన పల్సర్ మోటారు సైకిల్‌గా అతడి వద్ద ఉన్న మోటారు సైకిల్‌ను గుర్తించారు. అతడిని విచారించగా ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేటీఎం డూక్ మోటారు సైకిల్ కూడా అపహరించినట్టు విచారణలో వెల్లడైంది. ఆ రెండు మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రెండు లక్షల 80 వేలు రూపాయలు ఉంటుందని అంచనా వేశారు. అతడిని అరెస్టు చేశారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు.



శ్రీవారి ఆలయ మెట్లకు పూజలు

శ్రీవారి ఆలయ మెట్లకు తెలుగు మహిళల పూజలు

ద్వారకాతిరుమల, జూన్ 21: రావణరాజ్యం పోయి చంద్రన్న సారథ్యంలో రామరాజ్యం ఏర్పడినందుకు జడ్పీటీసీ మాజీ సభ్యురాలు మొగతడకల లక్ష్మీరమణి ఆధ్వర్యంలో మండలంలోని తెలుగు మహిళలు శ్రీవారి ఆలయ మెట్ల పూజ జరిపి మొక్కుబడులు తీర్చుకున్నారు. ప్రతీ మెట్టుకు పసుపు కుంకుమలను అద్ది పూజించి కొబ్బరికాయలు కొట్టారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. తెలుగు మహిళలు రాజుపాలెం సర్పంచ్ దేవరపల్లి నర్సమాదేవి, మాజీ ఎంపీటీసీ లంకా సీత, ఎంపీటీసీ కొయ్యలమూడి సరిత, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు సత్కారం



పల్లాకు శ్రీవారి ప్రసాదాలను అందిస్తున్న నేతలు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌యాదవ్‌ను ద్వారకాతిరుమల పార్టీ నేతలు పలువురు శుక్రవా రం కలసి సత్కరించారు. విజయవాడలోని ఓ అతిథిగృహం వద్ద ఆయనను పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కూరాకుల బుజ్జి యాదవ్, వాణిజ్యవిభాగ నేత ఇమ్మడి రత్నాజీ, రేవూరి వెంకటేశ్వర రావు, కొలకులూరి రవి తదితరులు కలసి శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, ప్రసాదాలను అందించా రు. అనంతరం ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

చండీ హోమం

పాలకొల్లు అర్బన్, జూన్ 21 : క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో జేష్ఠ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం చండీహోమం నిర్వహించారు. 32 మంది దంపతులచే చండీ హోమం నిర్వహించారు. చండీ హోమంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి శేష వస్త్రాలను బహూకరించారు. దీనిలో భాగంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అదే విధంగా పార్వతీ దేవి, లక్ష్మీ అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు.

దుర్గమ్మకు వెండి కంచం బహూకరణ


అమ్మవారి చిత్రపటాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టికి అందజేస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 21: తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం విజయవాడలో దుర్గమ్మవారిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కుటుంబీకులతో సహా శుక్రవారం దర్శించుకుని వెండి కంచాన్ని బహూకరించారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు అమ్మవారి చిత్రపటాన్ని బొలిశెట్టికి అందజేశారు. బొలిశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే హక్కు జగన్‌కు లేదు


వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 21: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన ఓటమికి అంతర్మథనం చేసుకోవడం పోయి నోటికి వచ్చినట్టు మాట్లాడటం సబబు కాదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమరావతి, పోలవరం లను నాశనం చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన జగన్‌కు సీఎం చంద్రబాబును విమర్శించే హక్కులేదన్నారు.

పిల్లలందరూ బడికి వెళ్ళాలి

ఆచంట, జూన్ 21: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి అన్నారు. ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి. నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధి నిధులు విడుదల చేయండి

ఉపాధి హామీ నిధులు సకాలంలో విడుదల కాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కమిటీ కార్యదర్శి ఎస్. వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉపాధి హామీ పనులను తామరాడ, దేవ, రామన్న పాలెం, వడలి గ్రామాల్లో పరిశీలించారు. కూలీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యదర్శి షేక్ పాదుషా పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం



భీమవరం అర్బన్, జూన్ 21: జగనన్న విదేశీ విద్యా పథకాన్ని అంబేడ్కర్ విదేశీ విద్యా పథకంగా మార్పుపై భీమవరం పట్టణ టీడీపీ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి అనంతరం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, నాయకులు ఎద్దు ఏసుపాదం, మాత సురేష్, మీసాల జయరాజు, మెరగాని నారాయణమ్మ, కనకదుర్గ పాల్గొన్నారు.

అన్నదానం

భీమవరం అర్బన్, జూన్ 21: భీమవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా భీమవరం పట్టణంలో సాధనాల వీరేంద్ర, శ్రీనివాస్ సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు.

షర్మిలను కలిసిన సీతారామ్

భీమవరం అర్బన్, జూన్ 21: రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డిని భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అంకెం సీతారామ్ విజయవాడ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిస్థితులను ఆమె అడిగి తెలుసుకున్నారని సీతారాం తెలిపారు. ఎన్నికల నియమావళి తర్వాత ఇప్పటివరకు నియోజవకర్గంలో చేసిన కార్యక్రమాలను అధ్యక్షురాలికి వివరించామన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ఉండి, జూన్ 21: పాములపర్రు పాఠశాల, మహదేవపట్నం హైస్కూళ్లలో విద్యార్థులకు కిట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కేశన శాంతకుమారి బలుసులరావు, వనిమా సుబ్బలక్ష్మి, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జు జుత్తుగ నాగరాజు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి జుత్తుగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: కోమటితిప్ప గ్రామంలోని నీటితిప్ప ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యాకానుక కిట్లను జడ్పీటీసీ తిరుమాని బాపూజీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పులపర్తి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ కవురు సీతామహలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

దళితుల పథకాలు పునరుద్ధరించాలి

పాలకొల్లు, జూన్ 21 :జగనన్న విదేశీ విద్యాపథకాన్ని మార్పు చేసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధిగా పేరు మార్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాలమహానాడు (పీవీరావు) రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్య వర ప్రసాదరావు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో దళితుల ఓట్లతో గద్దెనెక్కిన జగన్ దళితులను సులువుగా మోసం చేసిన సీఎం ఎవరైనా ఉన్నారంటే అది జగన్ మాత్రమేనని వర ప్రసాద్ పేర్కొన్నారు. నేడు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం దళితులకు న్యాయం చేయాలని, దళితులకు రద్దు చేసిన పథకాలు పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

ముత్యాలపల్లి విద్యార్థినికి ఐఐటీలో సీటు



మొగల్తూరు, జూన్ 21: ముత్యాలపల్లి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థిని కొల్లాటి దేవీ చంద్రికకు ఐఐటీలో ఉచిత సీటు సాధించింది. కొత్తోట గ్రామానికి చెందిన దేవి చంద్రిక ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసిన అనంతరం భీమవరంలోని తిరుమల కాలేజీలో ఇంటర్‌లో చేరి లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుని ఐఐటి ప్రవేశ పరీక్ష రాయగా ఇటీవల వెలువడిన ఫలితాల్లో జాతీయ స్థాయిలో 5994 ర్యాంకు సాధించింది. కౌన్సెలింగ్ మొదటి రౌండ్‌లోనే చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాయ్ ఐఐటిలో సీటు సాధించినట్టు బాలిక తండ్రి ఏసుబాబు శుక్రవారం విలేకరులకు తెలిపారు.


జంతువుల్ని హింసించవద్దు

ఆకివీడు, జూన్ 21:మూగ జీవుల పట్ల జాలి, దయతో ఉండాలని, హింసించవద్దని పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కె.జనార్ధనరావు అన్నారు. జంతు హక్కుల పరిరక్షణ, సంక్షేమంపై శుక్రవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. మూగజీవాలను హింసిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులగుతారన్నారు. పశువులను రోడ్లపైకి వదిలితే శిక్షార్హులగుతారన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి కెల్లా భార్గవిసత్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిర పాల్గొన్నారు.

మొగల్తూరు: మూగ జీవాలను హింసిచరాదని మండల పశువైద్యాధికారి నీలిమ అన్నారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. జంతు సంరక్షణ పట్ల యాజమాన్యం వ్యవహరించాల్సిన బాధ్యతలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వర్ధమాన రవిశంకర్ సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పాలకోడేరు, జూన్ 21: సామాజిక సేవలో ఆర్యవైశ్యులు అందరికన్నా ముందుంటారని పాలకోడేరు మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు అన్నారు. శృంగవృక్షం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతలు కూర్మాల బులినాగేశ్వరరావు దంపతులను అభినందించారు. గ్రామ సర్పంచ్ జంగం సూరిబాబు, టీడీపీ నాయకులు దొంగా కృష్ణ, కోడి సత్యనారాయణ, పెనుమత్స వరప్రసాదరాజు, ఎంపీటీసీ సత్యకృష్ణ, సోము రామకృష్ణ, యానాలశెట్టి, కూర్మాల నారాయణరావు పాల్గొన్నారు.







అసెంబ్లీలో పశ్చిమ ఎమ్మెల్యేలు

జనసేన ఎమ్మెల్యే అంజిబాబును అభినందిస్తున్న సీఎం చంద్రబాబు.. మంత్రి నిమ్మల.. ప్రొటెం స్పీకర్‌తో ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు.. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి.. ఏలూరు ఎమ్మెల్యే చంటి..మత్స్యకారుడి వేషధారణలో అసెంబ్లీకి వెళుతున్న నాయకర్





తణుకులో యోగా, ధ్యాన గురువులతో సత్యనారాయణరాజు.. కవిటంలో ఉపాధి కూలీల యోగాసనాలు.. ఆకివీడులో యోగాసనాలు

యోగాతో ఆరోగ్యం.. మానసిక ప్రశాంతత

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

భీమవరం టౌన్, జూన్ 21:ప్రపంచానికి భారతదేశం అందించిన అమూల్యమైన బహుమతి యోగా అని, నేటి మానవాళికి ఒక వరం యోగ అని రాష్ట్ర విశ్వ హిందూ పరిషత్ సభ్యులు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు అన్నారు. భీమవరంలోని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ కార్యాలయంలో యోగా దినోత్సవం సందర్భంగా యోగాసన, యోగా గురువులకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగాతో ఆరోగ్యంతో పాటు మనసుకు ప్రశాంతత లభిస్తుందని అన్నారు.

పాలకొల్లు అర్బన్: ప్రతి రోజూ యోగా చేస్తే ఆరోగ్యవంతమైన జీవన విధానం లభిస్తుందని యోగా గురువులు కేవీఎస్ నరసింహరాజు తెలిపారు. ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు యోగా సాధన చేయించి, నరసింహరాజు ప్రసంగించారు. ఈసందర్భంగా నరసింహ రాజును కళాశాల తరపున ఘనంగా సత్కరించారు. స్థానిక క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణ మండపంలో యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. మున్సిపల్ కమీషనర్ బండెల విజయసారధి పాల్గొన్నారు.

పెనుగొండ: పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులచే యోగాసనాలు, సూర్య నమస్కారాలు సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, ప్రిన్సిపాల్ మేరీ జాన్సీ, యోగా గురువు టి. సునీల పాల్గొన్నారు.

ఆచంట: ఆచంటలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సూర్యకుమారి, వైస్ ఎంపీపీ యర్రగొప్పుల నాగరాజు పలువురు అధికారులు, కూటమి శ్రేణులు, విద్యార్థులు పాల్గొన్నారు. కరుగోరుమిల్లి హైస్కూలులో జరిగిన యోగా కార్యక్రమంలో సర్పంచ్ అల్లం పద్మావతి, బీజేపీ నాయకులు విజయ కుమార్,హెచ్ఎం రఘురామ్‌రాజుపాల్గొన్నారు.

నరసాపురం టౌన్: వైఎన్ కళాశాల మెడిటేషన్ హాల్‌లో జిల్లా అదనపు న్యాయమూర్తి విజయదుర్గా యోగా చేశారు. ఒత్తిడి తగ్గించుకుని ఏకాగ్రత పెంచుకునేందుకు యోగా ఎంతో దోహదపడుతుందని విద్యార్థులకు వివరించారు. సూర్యకళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. లేసు ట్రేడ్ సెంటర్‌లో కలవకొలను తులసీ, సిబ్బంది చేత యోగా గురువు జక్కం బాబ్జీ యోగసనాలు చేయించారు. ఈకార్యక్రమంలో న్యాయమూర్తులు వరలక్ష్మి, శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దానయ్యనాయుడు, ప్రిన్సిపాల్ కాంతారావు, ఘంటశాల బ్రహ్మజీ పాల్గొన్నారు.

ఆకివీడు: యోగా దివ్యౌషధం లాంటిదని పతంజలి యోగారోగ్య కేంద్రం వ్యవస్థాపకులు డాక్టర్ బలరామ ప్రతాప్‌కుమార్ అన్నారు. యోగా శిష్య బృందంతో యోగాసనాచార్య కందుల సత్యనారాయణ సూర్యనమస్కారాలు, ఆసన, ప్రాణాయామం, ధ్యానం చేయించారు. అనంతరం యోగా గురువర్యులు సూ రి రాఘవ దీక్షితులు, వివేకానంద విగ్రహాలకు శిష్య బృందంతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాలకోడేరు: యోగాసనాలు వేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చుని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ.రంగం నాయుడు అన్నారు. పాలకోడేరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. అనంతరం గ్రామంలో యోగా ప్రాముఖ్యత పై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ర్యాలీ నిర్వహించారు.

భీమవరం క్రైం: 2వ అదనపు జ్యుడిషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో స్థానిక న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి యోగా తరగతులు నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇన్‌స్ట్రక్టర్ గోపాలశర్మ యోగాసనాలు వేయించారు. ఈకార్యక్రమంలో పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి ఎన్ సోమశేఖర్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) బి.అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.హనీషా, సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం ఎడ్యుకేషన్: కళాశాలలు, పాఠశాలల్లో యోగాసనాలు వేశారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నాడు యోగా దినోత్సవం సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు, ప్రిన్సిపాల్ డా.కెవి మురళీకృష్ణంరాజు ప్రసంగించారు. యోగా శిక్షకుడు పి రమేష్‌రాజును ఘనంగా సత్కరించారు. శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో ఇంటర్నేషనల్ యోగాడేను పురస్కరించుకుని విద్యార్థులచే వీరవాసరంకు చెందిన పిరమిడ్ మాస్టర్ ఓషో సాయి యోగా ముద్రలను వేయించారు. కళాశాల డైరెక్టర్ ఎం శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు. కాకతీయ మెరిట్ స్కూల్‌లో ప్రముఖ యోగా మాస్టర్ శ్రీచైతన్యఆర్యా ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించారు. కాకతీయ సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ అక్కినేని కృష్ణ కిషోర్ పాల్గొన్నారు.

ఉండి: ఉత్తేజం..ఆహ్లాదాన్ని యోగా అందిస్తోందని జిల్లా ప్రోగ్రాం అధికారిణి సీహెచ్ ధనలక్ష్మీ అన్నారు. శుక్రవారం ఉండి మండలం యండగండి ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో యోగ కార్యక్రమాలను నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యఅధికారి బెన్ని సామ్యూల్ అధ్యక్షత వహించారు. ఎన్ఆర్‌పిఅగ్రహారంలోని పంచాయతీ సిబ్బంది యోగా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ కార్యదర్శి జేవీటీ నాయుడు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు: కోర్టు ప్రాంగణంలో నాల్గో అదనపు జిల్లా న్యాయాధికారి డి. సత్యవతి ఆధ్వర్యంలో న్యాయాధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగాసనాలు వేశారు. యోగా మాస్టర్ శ్రీనివాసరావు యోగాసనాల వల్ల ఉపయోగాలు వివరించారు. న్యాయాధికారులు కె.కృష్ణసత్యలత, పీవీఎస్ రంజిత్‌కుమార్, ఏవీ నాగరాజు, పీఎస్వీ చిరంజీవిరావు తదితరులు పాల్గొన్నారు. పతంజలి యోగా గురువు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎన్జీవో హోంలో యోగాసనాలు వేశారు. అనంతరం వాసవి లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు సరస్వతి, ఎన్జీవో హోం అధ్యక్షుడు రాజు తదితరుల ఆధ్వర్యంలో శ్రీనివాసరెడ్డిని సన్మానించారు. ఎస్కేఎస్డీ మహిళా కళాశాల, పైడిపర్రు జడ్పీ హైస్కూల్, బీజేపీ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో యోగా డే నిర్వహించారు.

మొగల్తూరు: మొగల్తూరు అభ్యాస్ కళాశాలలో ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్, బీజేపీ కార్యకర్తలు యోగాసానాలు, ధ్యానం, సూర్యనమస్కారాలు చేశారు. చల్లా దామోదరం, మానేపల్లి సుబ్బారావు, లక్కు శేషు, కొప్పర్తి శ్రీను, గుడాల ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొని యోగా డే కార్యక్రమం విశిష్టతను వివరించారు.

పోడూరు: కవిటం గ్రామ పంచాయతీలో ఉపాధి కూలీలైన మహిళలకు యోగా గురువు తరపట్ల మోహన్‌రావు యోగా తరగతులు నిర్వహించారు. 50మంది మహిళా ఉపాధి కూలీలు యోగా కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు.

పెంటపాడు: యోగాతో ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని త్రీఎఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఓపీ గోయెంకా అన్నారు. ప్రత్తిపాడు త్రీఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ ఆశ్రమంలో విద్యార్థుల యోగాసనాలు అలరించాయి. ఇన్‌చార్జి వేమల శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియో మెడికల్ కాలేజీలో యోగా కార్యక్రమాన్ని పట్టణ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ డి.మురళీకృష్ణ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. సూర్యనారాయణ ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

గణపవరం: పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, లలిత పిరమిడ్ జ్ఞానకేంద్రం మాస్టారు పేరుమాళ్ళ మురళీకృష్ణ, డాక్టర్ వి.బాలరామ ప్రతాప్‌కుమార్, వాకర్స్ అసోసియేషన్ నాయకులు కాకర్ల విష్ణు శ్రీనివాసరావు, ఈశ్వరరాజు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నిర్మలకుమారి పాల్గొన్నారు.

తణుకు: తణుకు టీచర్స్ కాలనీలోని అరవింద పూర్ణయోగ మందిరంలో శుక్రవారం యోగా డే ఘనంగా జరిగింది. యోగా గురువు ఐఎంకే సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ ధ్యాన, యోగ పద్ధతులపై పలువురు అవగాహన కలిగించారు. విపశ్యన ధ్యాన పద్ధతిపై రామకృష్ణ, హర్ట్ ఫుల్‌నెస్ ధ్యానంపై చక్రధరరావు, ప్రాణిక్ హీలింగ్‌పై సోమరాజు, శ్రీశ్రీ రవిశంకర్ సుదర్శన క్రియా యోగపై సత్యనారాయణ వివరించారు. సుఖమయ జీవనానికి ఈ ధ్యాన పద్ధతులు మనకు ఎంతో ఉపయోగపడతాయని, వీటిని ఉపయోగించాలని సత్యనారాయణరాజు కోరారు.

రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం


స్నేహ హస్తం ఔట్‌రీచ్ క్యాంపులో పాల్గొన్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 21: రైల్వే సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా స్నేహ హస్తం పనిచేస్తుందని అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ అనిరుద్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం రైల్వే ఉద్యోగులు, పెన్షనర్‌ల పేమెంట్, ఇంక్రిమెంట్, సర్వీస్ ప్రమోషన్ తదితర సమస్యల పరిష్కారానికి సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ఆనంద్ కట్టా సూచనలతో స్నేహహస్తం ఔట్ రీచ్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రైల్వే స్టేషన్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులు, పెన్షనర్‌ల సమస్యల పరిష్కరించారు. స్టేషన్ మేనేజర్ వై. నాగరాజు, కమర్షియల్ సూపర్‌వైజర్ బి. భాస్కరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

పెనుగొండ, జూన్ 21: మునమర్రు, సోమరాజుచెరువు గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో 5 సంవత్సరాలు నిండిన బాల బాలికలకు గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. అనంతరం బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దంపనబోయిన రూపావతి, హెచ్ఎం పి.ఉషారాణి, మునమర్రు హెచ్ఎం వెంకట్రామయ్య పాల్గొన్నారు.

సార్వా దిగుబడి పెంచేందుకు ప్రణాళిక

నరసాపురం రూరల్, జూన్ 21: సార్వా దిగుబడి పెంచే విధంగా వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి ఆదేశించారు. శుక్రవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి ఏవోలతో సమీక్ష నిర్వహించారు. దిగుబడి పెరగకపోవడానికి గల కారణాలు, డ్రెయినేజీల నిర్వహణ, పల్లపు ప్రాంతాలు, చౌడు శాతం, అధిక ఎరువుల వినియోగం తదితర అంశాలపై చర్చించి నివేదిక తయారు చేశారు. సార్వాకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు ఉండేలా చూడాలన్నారు. ముందస్తు సాగుకు రైతులు ఉపక్రమించేలా వారిని చైతన్యపర్చాలన్నారు.

ఉచితాలతో వృథానే..

తణుకు, జూన్ 21: ప్రజలకు ఉచితాలతో ఏది ఇచ్చినా వృథానే అవుతుందని కేకే సర్వే అధినేత కొండేటి కిరణ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచితాలు కాకుండా ప్రతి చోటా ప్రభుత్వాలు ఆసుపత్రులు, విద్యా సంస్థలు, రహదారులు, కాల్వలు, తాగునీరు వంటి సౌకర్యాలు ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో డబ్బులు ఇవ్వకుండా పని చేయరన్నారు. పాలనలో మార్పులు రాకపోవడం వల్లే కులాలు, మతాలు, ప్రాంతాల ప్రాధాన్యత పెరిగిపోయిందన్నారు. ప్రజల అవసరాలకనుగుణంగా పాలన సాగాలన్నారు.

విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 21: విద్యుత్ వినియోగదారుల సమస్యలు సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి. సత్యనారాయణ స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార సదస్సులో ఆయన మాట్లాడుతూ సమస్యలపై 1912కు ఫోన్ చేస్తే సత్వరం స్పందిస్తామన్నారు. సభ్యులు వి. జనార్దనరావు, ఎం. శ్రీనివాస్, డాక్టర్ ఆర్. సురేంద్రకుమార్, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈఈ బి. రామకృష్ణ, సతీష్, ఏఈ ఎ. రామకృష్ణ పాల్గొన్నారు.

డీజీపీని కలసిన బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 21: బొలిశెట్టి శ్రీనివాస్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం శుక్రవారం విజయవాడలో రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు.

ఎస్టీ కాలనీలో వసతుల కల్పనపై కలెక్టర్ సమీక్ష

భీమవరం టౌన్, జూన్ 21 : వీరవాసరం ఎస్టీ కాలనీలో మౌలిక వసతుల మెరుగుదలకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆయన వీరవాసరం ఎస్టీ కాలనీ సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాలనీ స్థితిగతులపై అధ్యయనం చేయడానికి ఇంతకుముందే ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. వీరికి పక్కా ఇళ్ళు ఉన్నాయా లేవా, రిజిస్ట్రేషన్ పట్టాలు ఉన్నాయా, అందరికీ ఆధార్ కార్డులు, రైస్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, విద్యుత్ కనెక్షన్, మంచినీటి కుళాయిలు, ఎన్ఆర్జీఎస్ జాబ్ కార్డ్స్, టాయిలెట్స్ తదితరాలపై ఆరా తీస్తూ వీటిలో ఏమైనా లేనివారికి వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మంత్రులు, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు

పాలకొల్లు అర్బన్, జూన్ 21 : శాసన సభ సమావేశాలు ప్రారంభమైన తొలి రోజు శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రోటెం స్పీకర్ జి బుచ్చయ్య చౌదరి, స్పీకర్‌గా ఎంపికైన చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లాకు మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్సీ రామారావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

స్కూటీ.. బైక్ ఢీ: ఇద్దరు యువతులకు గాయాలు

పాలకోడేరు, జూన్ 21 : స్కూటీ, బైక్ ఢీకొన్ని సంఘటన శుక్రవారం రాత్రి గొల్లలకోడేరు గ్రామంలో జరిగింది. ఈ ప్రమాదంలో పాలకోడేరు గ్రామానికి చెందిన వి.రమ్య, దివ్యకు తీవ్ర గాయాలయ్యాయి. భీమవరం నుంచి స్కూటీపై వస్తున్న ఇద్దరు యువతులు గొల్లలకోడేరు గ్రామంలో లారీని ఓవర్‌టేక్ చేయబోయి గరగపర్రు గ్రామం నుంచి బైక్‌పై వస్తున్న ముంగర శ్రీను, ఆయన కుమార్తె సుధారాణిని ఢీకొట్టిరు. ఈ ప్రమాదంలో తండ్రీ, కుమార్తెకు స్వల్పగాయాలు కాగా, ఇద్దరు యువతలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో భీమవరం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

విద్యుత్ వైరు తెగిపడి చిరు వ్యాపారి మృతి



ఆకివీడు, జూన్ 21: విద్యుత్ వైరు తెగి వ్యక్తిమీద పడగా షాక్ కొట్టి మృతి చెందాడు. అయి-భీమవరం గ్రామానికి చెందిన అల్లాడి నరసింహులు (36) ఆకివీడు మెయిన్‌రోడ్‌లోని కృష్ణా ఆసుపత్రి దగ్గర బత్తాయి జ్యూస్ వ్యాపారం నిర్వహిస్తుంటాడు. శుక్రవారం రాత్రి విద్యుత్ ఎల్టీ మెయిన్ వైరు తెగి నరసింహులు మీద పడడంతో షాక్ కొట్టడంతో పడిపోయాడు. పక్కనే ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్ళగా చనిపోయినట్లు వైద్యుడు నిర్ధారించాడు. నరసింహులుకు భార్య ఇద్దర మగ పిల్లలు ఉన్నారు.

ట్రాక్టర్ దొంగలను పట్టిస్తే వదిలేస్తారా..

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 21: ట్రాక్టర్ దొంగలను పట్టిస్తే రూరల్ పోలీసులు ఆ దొంగలను స్టేషన్ బెయిల్ అంటూ వదిలేసి ట్రాక్టర్‌ను మాత్రం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ మాధవరం రైతులు శుక్రవారం ఆరోపించారు. బాధితుల వివరాలు ఇలా ఉన్నాయి. మాధవరానికి చెందిన కౌలూరి రామకృష్ణ తన ఇంటి ముందు కొబ్బరి కాయలతో ట్రాక్టర్‌ను ఉంచి ఉదయం లేచి చూసే సరికి మాయమైంది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసి కానిస్టేబుల్ సాయంతో నాలుగు రోజులు వెతికి నత్తా రామేశ్వరంలో గ్యారేజీలో ట్రాక్టర్ పార్టుల మార్చిడికి సిద్ధం చేయడం గమనించి వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించగా నిందితులను ఒక రోజు స్టేషన్‌లో ఉంచి రైతులకు చెప్పకుండా వారికి స్టేషన్ బెయిల్ ఇవ్వడంతోపాటు తమ ట్రాక్టర్లు ఇవ్వలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎస్సై సురేష్‌ను వివరణ కోరగా నిందితులకు నిబంధనల ప్రకారం స్టేషన్ బెయిల్ ఇచ్చామని ట్రాక్టర్‌ను కోర్టులో చూపించి రైతులకు ఒక ప్రొసీజర్ ప్రకారం అప్పగిస్తామన్నారు.

24న బహిరంగ వేలం

ఆకివీడు, జూన్ 21: నగర పంచాయతీ పరిధిలోని భుజబలరాయుడు మంచినీటి చెరువు, భుజబలరాయుడు స్టోరేజ్ ట్యాంకులో ఒకరోజు చేపలు పట్టుకొనుటకు ఈ నెల 24న బహిరంగ వేలం పాట స్థానిక కార్యాలయ ప్రాంగణంలో జరుగుతుందని కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు.

పులవర్తి సాయికి సన్మానం

భీమవరం టౌన్, జూన్ 21 : పట్టణానికి చెందిన ప్రజా సేవకుడు పులవర్తిసాయి ఆర్యవైశ్య లైమ్ లైట్ అవార్డును అందుకున్నారు. శనివారంనాడు హైదరాబాద్‌లోని ఫిలింనగర్‌లో జరిగిన కార్యక్రమంలో సాయికి తెలంగాణ రాష్ట్ర ఐటి మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అందుకున్నారు. ఆర్యవైశ్య స్వయం వరం గ్రూప్ లో 2వేల 500 పెళ్ళిళ్ళుచేయించినందుకు గాను ఈ అవార్డును ప్రదానం చేశారు.

మంత్రులను కలసిన రామరాజు

భీమవరం అర్బన్, జూన్ 21 : రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు తీసుకున్న నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, కొండపల్లి శ్రీనివాస్, ఎస్.సవితలకు జిల్లా టీడీపీ అధ్యక్షుడు మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు శుభాకాంక్షలు తెలిపారు.

శ్మశానంలో నిర్మాణాలు వద్దు

పాలకోడేరు, జూన్ 21: పాలకోడేరు శివారు పంతొట్టి వద్ద వివాదాస్పదంగా మారిన శ్మశానవాటిక స్థలంలో ఎటువంటి పనులు చెయ్యరాదని ఆర్‌పి నాగభూషణరావు, ఎస్సై నాశం శ్రీనివాసరావు కోరారు. శ్మశానంలో కొన్ని కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతానికి చేర్చి ఎస్సీలకు చెందిన శ్మశానవాటిక ఉంది. ఈ శ్మశానవాటికలో తమకు కూడా చోటు కల్పించాలంటూ బీసీ కులానికి చెందిన వారు ఆ స్థలం వద్ద నివసిస్తున్న కుటుంబాలను బెదిరించే విధంగా రహదారి నిర్మించటం, ఆక్రమణలు తొలగించే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో ఆ ప్రాంతవాసులు కలెక్టర్‌కు తెలియజేయడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవిన్యూ, పంచాయతీ, పోలీస్ ఆధ్వర్యంలో ఆ స్థలంలో శుక్రవారం నోటీసుబోర్డు ఏర్పాటు చేశారు.

తణుకులో టీడీపీ సంబరాలు

తణుకు, జూన్ 21: తణుకు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆరిమిల్లి రాధాకృష్ణ శుక్రవారం అసెంబ్లీ హాలులో ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో నియోజకవర్గంలో కూటమి నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

